నమస్తే తెలంగాణ
ఆదిలాబాద్ - నిర్మల్
5 | నిజామాబాద్ సోమవారం 24 మార్చి 2025 | ADILABAD NIRMAL



## రాళ్ల వాన

కురుస్తున్న రాళ్ల వర్షం

దస్తురాబాద్, మార్చి 23 : దస్తురాబాద్‌తోపాటు అన్ని గ్రామాల్లో ఆదివారం సాయంత్రం ఈదురుగాలులతో కూడిన రాళ్ల వాన కురిసింది. రాళ్ల వర్షం కురవడంతో మామిడి తోటలు దెబ్బతిన్నాయి. వరి పంట పూత దశలో ఉండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడింది.

## సీసీఐ ఫ్యాక్టరీని పునఃప్రారంభించాలి



దీక్షలో కూర్చున్న అఖిలపక్ష రైతు సంఘం నాయకులు

ఎదులాపురం, మార్చి 23 : ఆదిలాబాద్‌లో సిమెంట్ పరిశ్రమ పునఃప్రారంభించేలా కేంద్ర బడ్జెట్ సమావేశాల్లో ఎంపీ నగేశ్ కృషి చేయాలని అఖిల పక్ష రైతు సంఘం అధ్యక్షుడు బండి దత్తాత్రి అన్నారు. సీసీఐ సాధన కమిటీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట చేపట్టిన రిలే దీక్షలు ఆదివారం ఐదో రోజుకు చేరాయి. ఈ దీక్షలో అఖిల పక్షం రైతు సంఘం నాయకులు కూర్చున్నారు. కేంద్రం అనుసరిస్తున్న విధానాలను నిరసిస్తూ నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో అఖిల పక్ష రైతు సంఘం నాయకులు కొంగ రమేశ్, నల్ల గణపతి, లోకారి పోశెట్టి, చిలుక దేవీదాస్, మాసం నర్సింగారావ్, సురేశ్, సీసీఐ సాధన కమిటీ కో-కన్వీనర్ నారాయణ పాల్గొన్నారు.

# ఇదీ నీటి వరుస

- మంచినీటి కోసం కిలోమీటర్లు నడక
- సీఎం నిర్వహించిన ప్రజావాణిలో విన్నవించిన ఫలితం శూన్యం

*భగ్గుమంటున్న ఎండలకు భూగర్భ జలాలు అడుగంటిపోతున్నాయి. గుక్కెడు నీటి కోసం కిలోమీటర్లు నడవాల్సిన దుస్థితి ఏర్పడుతున్నది. ఆదిలాబాద్ జిల్లా నార్నూర్ మండలంలోని సుంగపూర్ గ్రామ పంచాయతీ పరిధిలోని తండాలు, గూడేలు తాగునీటికి అవస్థలు పడుతున్నారు. ఈ గ్రామంలో 270 కుటుంబాలు ఉండగా.. 1500 వరకు జనాభా ఉంటుంది. కొలాంగూడలో ఒక చేతిపంపు, గోండుగూడలోని అటవీ ప్రాంతంలో ఒక చేతిపంపు ఉండగా.. వీటి ద్వారా బొట్టు బొట్టు నీళ్లు వస్తాయి. రెండు చేతిపంపుల వద్ద రాత్రి, పగలు తేడా లేకుండా నీటి కోసం నిరీక్షించాల్సి వస్తున్నదని గ్రామస్తులు ఆవేదన చెందుతున్నారు. హైదరాబాద్‌లోని సీఎం ప్రజావాణిలో సమస్యను విన్నవించినా ఫలితం లేదని గ్రామస్తులు పేర్కొన్నారు.*

**- నార్నూర్, మార్చి 23**



సుంగపూర్‌లోని అటవీ సమీపంలో ఉన్న చేతిపంపు వద్ద తాగునీటి కోసం క్యూ కట్టిన ఆదివాసులు



అటవీ ప్రాంత సమీపంలోని చేతిపంపు నుంచి నెత్తిన బిందెలతో నీళ్లు తీసుకొస్తున్న ఆదివాసులు

**కాంగ్రెస్ తెచ్చిన కరువు**

# కంటతడి

## మండుతున్న ఎండలతో అడుగంటుతున్న భూగర్భ జలాలు

- ఎడారిని తలపిస్తున్న చెరువులు, కుంటలు, జలాశయాలు
- సాగునీరు అందక ఎండుతున్న పంటలను చూసి రైతుల ఆందోళన
- పంట పెట్టుబడి కూడా వస్తుందో.. రాదోనని దిగాలు..
- ప్రభుత్వం పరిహారం అందించి ఆదుకోవాలని వేడుకోలు



సాగు నీరు అందకపోవడంతో ఎండిపోయిన కందిపంట



పుచ్చకాయ పంట

ఇంద్రవెల్లి, మార్చి 23 : ఎండలు మండుతున్నాయి. భానుడు భగ భగ మంటున్నాడు. ఫలితంగా వ్యవసాయ బావులు, బోర్లు, చెరువులు, వంకలు, జలాశయాలు అడుగంటున్నాయి. భూగర్భ జలాలు ఇంకిపోవడంతో పంటలు వట్టిపోతున్నాయి. యాసంగిలో వేసిన పంటలు చివరి దశలో ఉండడంతో కండ్ల ముందరే ఎండుతుండడంతో రైతులు కంటతడి పెడుతున్నారు. ఇంద్రవెల్లి మండలంలోని హర్కాపూర్‌తండాకు చెందిన జాదవ్ ప్రకాశ్ సాగు చేసిన పుచ్చకాయ పంట, చౌహాన్ రాజుతోపాటు చౌహాన్ ఇనాబాయి, చౌహాన్ దేవనంద్, చౌహాన్ రంజిత్‌లకు చెందిన కంది పంట సాగు నీరు అందకపోవడంతో ఎండిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. వేల రూపాయల ఆర్థిక నష్టం జరిగిందని వాపోతున్నారు. హర్కాపూర్‌తండా, ఏమాయికుంట, కెస్లాగూడ(ఎం), అంజీ, ముత్నూర్, వడగాం, కెస్లాపూర్, దస్నాపూర్, వాల్గోండా, హీరాపూర్ గ్రామాల్లో ఎండల తీవ్రతకు బావులు, బోర్‌వెల్స్ అడుగంటి పోయాయి. దీంతో రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. పంట నష్టం జరిగిన రైతులను గుర్తించి ప్రభుత్వం నష్టపరిహారం అందించాలని కోరుతున్నారు.

### బోర్‌బావులు అడుగంటి పోయాయి..

*ఎండల తీవ్రతకు బోర్ బావులు అడుగంటి పోయాయి. నాకున్న రెండెకరాల వ్యవసాయ భూమిలో నాలుగు బ్యాగుల కంది సాగు చేశా. సాగు కోసం రూ.35 వేలు ఖర్చు చేశా. పంట చేతికొచ్చే సమయానికి బోర్‌బావులు అడుగంటి పోవడంతో సాగు నీరు అందడం లేదు. కాత, పూత వచ్చిన సమయానికి భూగర్భజలాలు అడుగంటి పోవడంతో తీవ్రనష్టం జరిగింది. ప్రభుత్వం అధికారులతో ఎండిపోయిన పంటలపై సర్వేలు చేసి పరిహారం అందించే విధంగా చర్యలు తీసుకోవాలి.*

**- చౌహాన్ రాజు, రైతు, హర్కాపూర్‌తండా**





### పుచ్చకాయ పంట ఎండిపోయింది..

*సాగు చేసిన పుచ్చకాయ పంటకు సమయానికి సాగు నీరు అందకపోవడంతో ఎండిపోతున్నది. నాకున్న మూడెకరాల వ్యవసాయ భూమిలో రూ.1.50 లక్షల పెట్టుబడి పెట్టి పుచ్చకాయ సాగు చేశా. ఇంకా మూడు నెలల వరకు చేతికొస్తుంది. బోర్‌వెల్‌లో పూర్తిగా నీరు అడుగంటి పోయింది. సాగు నీరు సరిగా అందకపోవడంతో పంట ఎదుగుదల లేక ఎండిపోతున్నది. కాసిన పుచ్చకాయలు కూడా చిన్నగా ఉన్నాయి. వాటి ఎదుగుదల లేదు. పెట్టిన పెట్టుబడి డబ్బులు కూడా వస్తాయా? రాదా? అని ఆందోళనగా ఉంది. ఇప్పటికి ఒక్క పుచ్చకాయను కూడా అమ్మలేదు. పంటకు ప్రభుత్వం పరిహారం చెల్లించి ఆదుకోవాలి.*

**- జాదవ్ ప్రకాశ్, రైతు, హర్కాపూర్ తండా**



జొన్న పంట

## మూల్యాంకన విధులు పారదర్శకంగా నిర్వహించాలి

నిర్మల్ చైన్‌గేట్, మార్చి 23 : మూల్యాంకన విధులు పారదర్శకంగా నిర్వహించాలని డీఈవో పి. రామారావు అన్నారు. నిర్మల్ జిల్లా కేంద్రంలోని సెయింట్ థామస్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి పరీక్షల స్పాట్ వాల్యూవేషన్ క్యాంపు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రస్తుతం పదో తరగతి పరీక్షలు నడుస్తున్నాయన్నారు. వివిధ జిల్లాల నుంచి దాదాపు 1,27,748 జవాబు పత్రాలు జిల్లాకు చేరుతాయని, మూల్యాంకనంలో కోడింగ్ ప్రక్రియకు కేటాయించిన సీఈవోలు, ఏసీవోలు తమ విధులను జాగ్రత్తగా, పారదర్శకంగా నిర్వహించాలన్నారు. ఈ సందర్భంగా ఆర్జేడీ వరంగల్ సత్యనారాయణరెడ్డి జూమ్ సమావేశం ద్వారా ఇక్కడి అధికారులకు క్యాంపు నిర్వహణకు సంబంధించి పలు సూచనలు చేశారు.



మాట్లాడుతున్న నిర్మల్ డీఈవో రామారావు

## గంజాయి మొక్కలు ధ్వంసం

నేరడిగొండ, మార్చి 23 : కొర్టికల్ గ్రామ శివారులోని పొలంలో కూరగాయల మాటున గంజాయి సాగు చేయడాన్ని నేరడిగొండ పోలీసులు గుర్తించారు. ఎస్ఐ శ్రీకాంత్ వివరాల ప్రకారం.. మండలంలోని కొర్టికల్ గ్రామానికి చెందిన పడ్వాల్ దశరథ్, ఆయన భార్య సాగర్‌బాయిలు లింగట్ల గ్రామానికి చెందిన అమర్‌సింగ్ చేనును మూడేండ్లుగా కౌలుకు తీసుకున్నారు. ఇందులో మిరప, వంగ, బెండ సాగు చేస్తున్నారు. అంతర పంటగా గంజాయి సాగు చేస్తున్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు ఘటనా స్థలానికి వెళ్లి తనిఖీ చేయగా ఫారెస్ట్ కంపార్ట్‌మెంట్ నంబర్ 48 భూమిలో 17 గంజాయి మొక్కలను గుర్తించి ధ్వంసం చేశారు. దీని విలువ రూ.1.70 లక్షలు ఉంటుందని పేర్కొన్నారు. సాగు చేస్తున్న భార్యాభర్తలపై కేసు నమోదు చేశారు. దశరథ్ పరారీలో ఉన్నట్లు తెలిపారు. ఇందులో ఇచ్చోడ సీఐ భీమేశ్ పాల్గొన్నారు.



ధ్వంసం చేసిన గంజాయి మొక్కలను చూపుతున్న ఎస్ఐ శ్రీకాంత్

## రైతు ఆత్మహత్యాయత్నం

- అధికారుల వేధింపులు తాళలేక పురుగుల మందు తాగాడు
- రెవెన్యూ అధికారుల అలసత్వమే కారణమంటున్న బాధిత కుటుంబం

లక్ష్మణచాంద, మార్చి 23 : నిర్మల్ జిల్లా లక్ష్మణచాంద మండలంలోని పొట్టపెల్లి(కే) గ్రామానికి చెందిన తొడిశెట్టి భూమన్న 30 ఏండ్ల క్రితం పూర్వ రాచాపూర్ గ్రామంలోని వడ్యాల్ శివారంలో సర్వే నంబర్ 929, 930, 931లో ఐదెకరాల భూమిని కొనుగోలు చేశాడు. ఈ భూమి పొట్టపెల్లి(కే) గ్రామాన్ని ఆనుకుని ఉండడం, పొట్టపెల్లి (కే) గ్రామస్తులు గ్రామానికి చెందిన భూమిని తొడిశెట్టి భూమన్న సాగు చేస్తున్నట్లు అనుమానించారు. గ్రామానికి చెందిన భూమి గ్రామానికి కొలిచి ఇవ్వాలని కొన్ని రోజులుగా వీడీసీ సభ్యులు జిల్లా స్థాయి అధికారులను కలిసి విన్నవించుకున్నారు. ఈ నెల 10 జిల్లా సర్వేయర్ వచ్చి భూమి కొలతలు జరిపాడు. జిల్లా సర్వేయర్ కూడా సరియైన హద్దులు గుర్తించలేదని బాధిత కుటుంబ సభ్యులు తెలిపారు. భూమి కొలతలు తేల్చడంలో అధికారులు విఫలం కావడంతో విసుగు చెందాడు. అధికారులు, గ్రామస్తులు తమకు ఇబ్బందులు గురి చేస్తున్నారని తరచూ కుటుంబ సభ్యులతో చర్చించేవాడు. రెవెన్యూ అధికారులు భూమి సరిహద్దులు తేల్చకపోవడంతో భూమి హద్దులు తేల్చాలని తొడిశెట్టి భూమన్న ఇటీవల కోర్టులో కేసు నమోదు చేశాడు. కేసు నమోదు చేసినప్పటి నుంచి రెవెన్యూ అధికారులు, గ్రామస్తులు తనను ఇక్కట్లు గురి చేస్తున్నారని భావించిన ఆయన ఆదివారం పురుగుల మందుతాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. గమనించిన కుటుంబ సభ్యులు నిర్మల్ జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేటు దవాఖానకు తరలించారు. ప్రస్తుతం అతని పరిస్థితి ఆందోళనకరంగా ఉన్నట్లు తెలిపారు.



దవాఖానలో చికిత్స పొందుతున్న తొడిశెట్టి భూమన్న